క్లుప్తంగా

ఆటోడ్రైవర్ల ధర్నా



మరికల్: ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ అమలు చేయాలని శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆటోడ్రైవర్లు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఆటో యూనియన్ అధ్యక్షుడు కుర్మయ్య మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్న సందర్భంగా ఆటోడ్రైవర్లకు ఏడాదికి రూ.12 వేలు ఆర్థికసాయం చేస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. ఉచిత బస్సు కారణంగా ఆట డ్రైవర్లకు కుటుంబపోషణ కష్టంగా మారిందన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అంజనేయులు, చింతలయ్య, బసంత్, శివ, చంద్రయ్య, రాము పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



కోస్గి రూరల్: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించేందుకే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ చేపట్టామని మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో చెన్నారం గ్రామానికి చెందిన బోడ కిష్టమ్మ కుటుంబ సభ్యులకు సీఎం సహాయనిధి చెక్కు మంజూరు కాగా అందజేశారు. కార్యక్రమంలో మల్లేష్ , రాస్నం బాల్‌రాజ్ , ప్రశాంత్ రెడ్డి , హరీష్‌గౌడ్ , అనంతయ్య ఉన్నారు.

పాఠశాలకు వాటర్ ఫిల్టర్ వితరణ

కృష్ణా: మండలంలోని కున్సీ గ్రామంలో గల జైన మందిరం సభ్యులు శనివారం స్థానిక ప్రాథమిక పాఠశాలకు వాటర్ ఫిల్టర్‌ను వితరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జైనమందిరానికి చెందిన విజయరాజ్ తిలక్ సూరీశ్వర్ జ్ఞాపకార్థం పాఠశాలకు ఫిల్టర్‌ను అందించినట్లు తెలిపారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నల్లె శివరాజ్ ట్రస్ట్ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. శివరాజప్పసౌకార్, ప్రభు పూజారి, భరత్‌సేట్, లాల్‌చంద్‌జైన్ పాల్గొన్నారు.

కళాశాలకు నూతన భవనం నిర్మించాలి

నారాయణపేట రూరల్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో కొత్త భవనాన్ని నిర్మించాలని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్, సహాయ కార్యదర్శి వెంకటేష్ డిమాండ్ చేశారు.ఈ మేరకు శనివారం కళాశాల విద్యార్థులతో కలిసి సెంటర్ చౌక్ వరకు నిరసన ర్యాలీ చేపట్టి ధర్నా చేశారు. గదుల్లో పెచ్చులూడిపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, సురేష్, నందిని, దత్తు, స్వప్న, సుధాకర్, వెంకటేష్, వైశాలి, నవీన, భానుప్రియ, రాజేష్, హేమలత, అనిత పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

నారాయణపేట టౌన్: క్రీడలలో రాణించడం ద్వారా ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవచ్చని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక మినీ స్టేడియంలో నిర్వహించిన సౌత్ జోన్ జిల్లా స్థాయి పోటీలను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులను అభినందించి, రాష్ట్ర స్థాయిలోనూ సత్తా చాటి జిల్లాకు గుర్తింపు తీసుకురావాలన్నారు.

ఘనంగా కార్గిల్ దివస్

ఊట్కూరు/మరికల్: ఊట్కూరుతో పాటు మరికల్‌లో శనివారం కార్గిల్ విజయోత్సవ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా అమరవీరుల చిత్రపటాలకు స్థానిక నాయకులు నివాళులు అర్పించారు. ఏఎస్‌ఐ సాయిబాబా మాట్లాడుతూ విద్యార్థులు, యువకులు చిన్నప్పటి నుంచే దేశభక్తిని కలిగి ఉండాలన్నారు. గ్రామంలో యువకులు కార్గిల్ విజయోత్సవ దినాన్ని జరుపుకోవడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఆంజనేయులు గౌడ్, బసిరెడ్డి, భీంరెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, విజయ్, శంకర్ పాల్గొన్నారు.

ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు వినతి

మద్దూరు: తమ భూమిని కబ్జా కాకుండా కాపాడాలని లక్కయిపల్లి గ్రామానికి చెందిన పలువురు దళితులు కోరారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని సర్వే నెంబర్ 105లో 1.24 ఎకరాల్లో తమ తాతముత్తాతల కాలం నుంచి సాగు చేస్తూ అనుభవిస్తున్న భూమిని కొందరు ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్నారన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తమకు న్యాయం చేయాలని కోరారు.

మొక్కుబడిగా వనమహోత్సవం



కొత్తపల్లి తండా నర్సరీలో పెంచుతున్న మొక్కలు

- నర్సరీలు దాటని మొక్కలు
- వర్షాలు కురుస్తున్నా కార్యక్రమాన్ని ప్రారంభించని అధికారులు

గడువులోగా పూర్తి చేస్తాం

వనమహోత్సవంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఈనెల చివరి వరకు పూర్తి చేయడానికి కృషి చేస్తాం. రోడ్ల వెంబడి గుంతలు తీయడానికి కూలీలు దొరకపోవడం తదితర కారణాల వల్ల మొక్కలు నాటలేకపోయాం. నర్సరీల నుంచి మొక్కలు తరలిస్తే వన సేవకులకు వచ్చే వేతనం కూడా ఆగిపోతుంది. దీనిపై క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టి త్వరలోనే మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడతాం.

– నాగరాజు, ఏపీఓ, మద్దూరు

మద్దూరు: రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంపొందించడానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వనమహోత్సవం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మొక్కలు నాటేలా కార్యాచరణ రూపొందించి నర్సరీలలో మొక్కలు కూడా సిద్ధం చేసింది. అయితే రాష్ట్ర వ్యాప్తంగా వారం రోజులుగా వర్షాలు కురుస్తున్నా మొక్కలు నాటేందుకు అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో కార్యక్రమం మొక్కుబడిగా చేపట్టినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి మద్దూరులో మండలంలో వారం రోజులుగా వర్షాలు దంచికొడుతున్నాయి. అయినా ఇప్పటి వరకు మొక్కలను నాటడానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఉపాధి హామీ పథకంలో భాగంగా ఉమ్మడి మద్దూరు మండలంలో 43 గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసినా నర్సరీల్లో దాదాపు 2 లక్షల వివిధ రకాల మొక్కలను పెంచారు. వీటిలో ఇప్పటి వరకు వ్యవసాయ పొలాల్లో నాటడానికి రైతులకు మాత్రమే మామిడి మొక్కలను అందజేసినట్లు తెలుస్తోంది. 70 ఎకరాల్లో మామిడి మొక్కలు పెంచేందుకు ప్రణాళికలు చేపట్టినా ఇప్పటి వరకు 16 ఎకరాల్లో మామిడి మొక్కలను నాటినట్లు అధికారులు తెలిపారు.

45 వేల మొక్కలు ఆర్‌అండ్‌బీ శాఖకు

వనమహోత్సవంలో భాగంగా ఆర్‌అండ్‌బీ రోడ్ల వెంబడి మొక్కలు నాటడానికి నర్సరీల్లో 45 వేల మొక్కలు సిద్ధం చేశారు. ఉమ్మడి మద్దూరు మండలంలో బీటీ రోడ్లు పనులు జరుగుతున్న నేపథ్యంలో ఆ శాఖ అధికారులు మొక్కలు నాటడానికి ముందుకు రావడం లేదని తెలుస్తోంది. ఆర్‌అండ్‌బీ రోడ్లు మొత్తం రెండు వరుసల రోడ్లు, హైవే రోడ్లు కావడంతో సమీప పొలాల వాళ్లు మొక్కలు నాటడానికి నిరాకరిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే రోడ్డు విస్తీర్ణంలో తమ పొలాలను కోల్పోతుండడంతో మళ్లీ ఈ మొక్కలు ఎక్కడ నాటుతారని రైతులు అడ్డుకుంటున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు.

నర్సరీల్లోనే మొక్కలు

మండలంలో చాల నర్సరీల్లో ఇంకా మొక్కల పంపిణీ కార్యక్రమం ప్రారంభించనే లేదు. కొత్తపల్లి తండా నర్సరీల్లో ఇప్పటి వరకు ఒక్క మొక్క కూడా పంపిణీ జరుగలేదు. అలాగే చాలా నర్సరీల్లో మొక్కల పంపిణీ చేపట్టలేదు. అయితే ఇప్పటి వరకు ఉమ్మడి మద్దూరు మండలంలో 56 వేల గుంతలను తీసినట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకు 38 వేల మొక్కలను నాటినట్లు పేర్కొంటున్నారు. వనమహోత్సవంలో భాగంగా ఈనెల 31 వరకు పూర్తి స్థాయిలో మొక్కలు నాటాల్సి ఉండగా ఇప్పటి వరకు 30 శాతం కూడా పూర్తి కాకపోవడం గమనార్హం.

ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేత



ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్‌లను అందజేస్తున్న ఎంపీడీఓ, నాయకులు

మరికల్: మండలంలోని జిన్నారం గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు శనివారం ఎంపీడీఓ కొండన్నతో కలిసి జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు సూర్యమోహన్‌రెడ్డి, చెన్నయ్యలు ఇళ్ల ప్రొసీడింగ్‌లను అందజేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పదేళ్ల అధికారంలో ఉండి కూడా పేదలకు ఇళ్లు కట్టించకుండా మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తక్కువ సమయంలోనే పేదలందరికీ ఇళ్లు మంజూరు చేసి నిర్మాణ పనులు ప్రారంభించిందన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, మల్లికార్జున్, మల్లేష్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

దరఖాస్తుల గడువు పెంపు

కోస్గి రూరల్: మండల పరిధిలోని బిజ్జారం గ్రామంలో నూతన మీ సేవ కేంద్రం ఏర్పాటుకు దరఖాస్తుల గడువును పెంచినట్లు జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్‌గంగ్వార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్హతలు కల్గిన అభ్యర్థులు దరఖాస్తులను ఈనెల 26వ తేదీలోగా కలెక్టర్ కార్యాలయంలో సమర్పించాలని కోరామని 26న బ్యాంకులకు సెలవు, 27న ప్రభుత్వ సెలవు ఉన్నందున గడువును సోమవారం వరకు పెంచినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రైతు సంఘంలో సభ్యులుగా చేరాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న వెంకట్రాములు

మరికల్: కేంద్ర ప్రభుత్వం రైతుల సంక్షేమ కోసం ప్రవేశపెట్టిన రైతు ఉత్పత్తి సంఘంలో రైతులందరూ సభ్యులుగా చేరాలని కార్యదర్శి వెంకట్రాములు సూచించారు. ఎలిగండ్ల గ్రామంలో శనివారం ధన్వాడ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తి సహకార సంఘ సభ్యత్వ నమోదుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒకసారి రూ.2 వేలు చెల్లించి సంఘంలో చేరితే ప్రభుత్వం అందజేసే పథకాలు రైతులకు నేరుగా అందుతాయన్నారు. కార్యక్రమంలో విండో అధ్యక్షుడు వెంకట్రామారెడ్డి, చిన్నబాలు, హన్మంతు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సగరులను బీసీ-ఏలో చేర్చాలి

ధన్వాడ: సంగర ఉప్పర కులస్తులను బీసీ-డీ గ్రూప్ నుంచి ఏ గ్రూప్‌లోకి మార్చాలని రాష్ట్ర సగర సంఘం స్టీరింగ్ కమిటీ సభ్యులు ఆంజనేయులు సాగర్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ తమ సామాజిక వర్గాన్ని బీసీ-డీ చేర్చడం వల్ల ఉద్యోగ అవకాశాలు దక్కడం లేదని వాపోయారు. అన్ని పార్టీల నాయకులు తమ సామాజిక వర్గాన్ని ఓటు బ్యాంకుకు వాడుకుంటున్నారు తప్ప రాజకీయంగా ప్రోత్సహించడం లేదన్నారు. రాజ్యసభ ఎమ్మెల్సీ కార్పొరేషన్ చైర్మన్ వంటి నామినేట్ పదవులలో కూడా తమ కులానికి అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ సమాజిక వర్గాన్ని బీసీ-ఏలో చేర్చాలని కోరారు.

మడ అడవులు.. ప్రకృతి వరం



వీడియో ద్వారా వివరిస్తున్న మల్లేషం

కోస్గి రూరల్: సైనికుల వలె తీరాన్ని రక్షిస్తూ ఎన్నో మొక్కలకు, జంతువులకు ఆవాసాన్ని అందించే మడ అడవులు ప్రకృతి మానవాలికి అందించిన వరమని ఎంగ్ ఎర్త్ లీడర్స్ సమన్వయ కర్త వార్ల మల్లేషం అన్నారు. ప్రపంచ మడ అడవుల సంరక్షణ దినోత్సవం సందర్భంగా శనివారం మండల పరిధిలోని మీర్జాపూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు 'పర్యావరణ సంరక్షణ-మడ అడవులు పాత్ర' అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సునామీ, వాతావరణ మార్పులు వంటి ప్రకృతి వైపరీత్యాల నుంచి మడ అడవులు మానవ సమాజాన్ని కాపాడుతాయన్నారు. అనంతరం గుజరాత్ , మహారాష్ట్ర , తమిళనాడు, కర్ణాటక , రత్నగిరి, గోవా , కావేరి డెల్టాలో గల మడ అడవులలో జీవవైవిధ్యాన్ని వీడియోల ద్వారా తెలియజేశారు.

బీజేపీలోకి మాజీ ప్రజాప్రతినిధులు

నారాయణపేట రూరల్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు సమక్షంలో పలువురు కాషాయం కండువా కప్పుకున్నారు. మాజీ ఎంపీపీ మణెమ్మ, మాజీ జెడ్పీటీసీ అరుణ, మాజీ ఎంపీటీసీ అశోక్‌తో పాటు పలువురు తిరిగి సొంతగూటికి చేరుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కొండా సత్య యాదవ్, మండల అధ్యక్షులు జ్యోతి సాయి బన్న, కంచె శ్రీనివాస్ పాల్గొన్నారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నారాయణ పేట క్రైమ్: మత్తు పదార్థాలతో జీవితం నాశనం చేసుకోవద్దని ఏఎస్‌ఐ ఆంజనేయులు ప్రజలకు సూచించారు. శనివారం మత్తు పదార్థాలు, సైబర్ నేరాలు, రోడ్డు భద్రత నిబంధనలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం మత్తు పదార్థాలకు యువత బానిసవుతున్నారని, మత్తుకు అలవాటుపడితే బంగారం లాంటి జీవితం నాశనం అవుతుందన్నారు. అలాగే సైబర్ నేరస్తులతో, మోసపూరిత ప్రకటనలతో అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు సంప్రదించాలని సూచిచారు. కార్యక్రమంలో పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై ఫిర్యాదు



కృష్ణా: హుజురాబాద్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై కాంగ్రెస్ నాయకులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కౌశిక్‌రెడ్డి ఇటీవల సీఎం రేంవత్ రెడ్డి, రాష్ట్రమంత్రులపై సోషల్ మీడియా వేదికగా అనుచిత వాఖ్యలు చేశారు.ఈ క్రమంలో ఆయనపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయ కులు శనివారం ఫిర్యాదు అందజేశారు. పార్టీ మండల అధ్యక్షుడు రాజప్పగౌడ, నాయకులు సర్ఫరాజ్, పల్లె సురేష్, సంతోష్ పాటిల్, సిద్రామ్, ఈరన్ననాయక్, నాగేష్,సుదర్శన్,తిమ్మణ్ణ, బాబు పాల్గొన్నారు.

30న ఉచిత వైద్యశిబిరం

నారాయణపేట రూరల్: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 30న నిర్వహిస్తున్న ఉచిత మెగా ఆరోగ్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ గవర్నర్ హరి నారాయణ్ బట్టడ్ అన్నారు. ఈ మేరకు వైద్యశిబిరానికి సంబంధించిన పోస్టర్‌ను శనివారం ఆయన ఆవిష్కరించారు. పట్టణంలోని పాత గంజ్ యశోద కేర్ హస్పిటల్‌లో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి సాయినాథ్, మాల్గాన్ జనార్ధన్, సదానంద్ చారి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.



రాకపోకలు పునరుద్ధరణ



కోస్గి రూరల్: మండల పరిధిలోని ముశ్రీఫా గ్రామంలో నూతన బ్రిడ్జి పనులను చేపడుతున్న కాంట్రాక్టర్ ముందు చూపు లేకుండా అనాలోచిత నిర్ణయాల వల్ల సాధారణ ప్రజానీకం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రహదారి కోట్టుకుపోవడంతో దౌల్తబాద్ మండలం నుంచి పలు గ్రామాలకు శనివారం రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎంపీడీఓ శ్రీధర్ , తహసీల్దార్ శ్రీనివాసులు రహదారిని పరిశీలించి చర్యలు చేపట్టారు. ఇరువైపులా బారికేడ్లను ఏర్పాటు చేయించి సాయంత్రం వరకు తాత్కాలిక రోడ్డు వేయించి రాకపోకలను పునరుద్ధరించారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

కృష్ణా: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని కున్సీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, సీజీఆర్ కౌన్సిల్ ఫర్ గ్రీన్ రివల్యూషన్ సంస్థ ప్రతినిధులు బాలంజనేయులు, జగన్ సూచించారు. శనివారం మండల పరిధిలోని కున్సి గ్రామ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరేందర్,ఖాసీమ్ ఆలీ,ఉషా,తాయప్ప, నర్సింములు పాల్గొన్నారు.

భూ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలి



తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న రైతులు

మక్తల్: మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం కింద భూములు కోల్పోతున్న వారికి న్యాయమైన నష్టపరిహారం చెల్లించాలని కాట్రేవ్‌పల్లి, యర్నాగాన్‌పల్లి, కాచ్‌వార్ గ్రామాలకు చెందిన రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. అనంతరం భూ నిర్వాసితుల జిల్లా నాయకులు ఆంజనేయులు, గోవిందురాజులు మాట్లాడుతూ భూములు కొల్పోతున్న రైతులకు రూ.14 లక్షల నష్టపరిహారం ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. 2013 భూ చట్టం ప్రకారం న్యాయమైన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ సతీశ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కేశవులు, రవీందర్‌రెడ్డి, రాజు, రవికుమార్, నర్సప్ప, శ్రీశైలం, వెంకటప్ప, భీరప్ప, నర్సింహులు పాల్గొన్నారు.

బలవంతపు భూసేకరణ ఆపాలి

దామరగిద్ద: పేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం భూ నిర్వాసితులకు న్యాయమైన పరిహారం చెల్లించాలని భూ నిర్వాసితుల సంఘం జిల్లా నాయకులు గోపాల్, జిల్లా కార్యదర్శి అంజిలయ్యగౌడ్‌లు డిమాండ్ చేశారు. బహిరంగ మార్కెట్ ధరకు అనుగుణంగా పరిహారం చెల్లించాలన్నారు. బలవంతపు భూ సేకరణ ఆపి రైతులను ప్రలోభాలకు గురిచేయడం మానుకోవాలన్నారు. అనంతరం తహసీల్దార్ తిరుపతయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మహేష్‌కుమార్, సీఐటీయూ కార్యదర్శి జోషి, శివకుమార్, మొగులప్ప, శ్రీనివాస్ రెడ్డి, నారాయణ, సంతోస్, చంద్రశేఖర్, సిత్యానాయక్, హన్మంతు రైతులు పాల్గొన్నారు.

భూసేకరణను ఒప్పుకోం

నారాయణపేట: నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న భూనిర్వాసితులకు న్యాయమైన పరిహారం అందించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బండమీది బలరాం డిమాండ్ చేశారు. శనివారం భూ నిర్వాసితుల సంఘం ఆధ్వర్యంలో మండలం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. భూ నిర్వాసితులకు న్యాయమైన పరిహారం అందించకుండా అరకొర సాయం అందించి భూసేకరణ చేపడితే ఒప్పుకోమన్నారు. సంఘం జిల్లా నాయకులు సింగారం హనుమంతు, లక్ష్మీకాంత్, రాఘవేందర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

రూ.40లక్షల పరిహారం అందించాలి

ఊట్కూరు: మక్తల్-కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ.40లక్షల పరిహారం చెల్లించాలని బాధిత రైతులు కోరారు. ఈ మేరకు శనివారం ర్యాలీగా బయలుదేరి తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. దీంతో రైతులు, పోలీసుల మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. రైతులకు మద్దతుగా సింగిల్‌విండో అధ్యక్షుడు బాల్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సూర్యప్రకాష్‌రెడ్డి సంఘీభావం వ్యక్తం చేశారు.

బస్టాండ్‌లో వరినాట్లు వేసి నిరసన



బస్టాండ్‌లో వరినాట్లు నాటుతున్న నాయకులు

మరికల్: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో పడ్డ గుంతలను పూడ్చాలని శనివారం బీఆర్‌ఎస్ నాయకులు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. బస్టాండ్ ప్రాంగణంలోనే వరినాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు తిరుపతయ్య మాట్లాడుతూ బీఆర్‌ఎస్ హయంలో అప్పటి ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి బస్టాండ్ ఆధునికీకరణ కోసం రూ.1.70 కోట్లు మంజూరు చేయించారని, ప్రభుత్వం మారడంతో నిధులు వెనక్కి వెళ్లాయన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే పర్ణికారెడ్డి వెంటనే నిధులు మంజూరు చేయించి బస్టాండ్‌లో మరమ్మతు పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకపోతే బస్టాండ్‌లోకి బస్సులు వచ్చే అవకాశం లేకుండా పోతుందన్నారు. కార్యక్రమంలో బసంత్, రవి, కృష్ణారెడ్డి, కృష్ణయ్య, శ్రీనివాస్, బాలకిష్ట, మతిన్, నర్సిములు, కమల్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన



లబ్ధిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న నాయకులు

మాగనూర్: కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తుందని, అందుకే అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి నూతన రేషన్ కార్డులను మంజూరు చేసిందని మాగనూర్ మాజీ వైస్ ఎంపీపీ దూళ్ల తిప్పయ్య అన్నారు. శనివారం మండలంలోని వర్కూర్ గ్రామంలో నూతనంగా మంజూరైన 60 రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మనిషికి 6 కిలోల చొప్పున సన్న బియ్యం పంపిణీ చేసి ప్రతి ఇంటికి సీఎం రేవంత్‌రెడ్డి పెద్ద కొడుకు అయ్యారన్నారు. రేషన్‌కార్డులు లేక పథకాలకు దూరంగా ఉన్న వారికి ఇప్పుడు అన్ని సంక్షేమ పథకాలు దక్కనున్నాయన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నర్సింహరెడ్డి, కాంగ్రెస్ నాయకులు నర్సింహ, కృష్ణయ్య, రాము, మొగ్గలప్ప, రవి తదితరులు పాల్గొన్నారు.

ధన్వాడ: మండలంలోని లబ్ధిదారులకు నూతనంగా మంజూరైనా రేషన్ కార్డులను స్థానిక నాయకులు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పేట మార్కెట్ కమిటీ డైరెక్టర్ లక్ష్మయ్యగౌడ్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పదేళ్లుగా రేషన్‌కార్డులను మంజూరు చేయకుండా ప్రజలను ముప్పతిప్పలు పెట్టిందని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రేషన్‌కార్డులను మంజూరు చేసి పేదలకు సంక్షేమపథకాలు అందేలా చర్యలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో సుధాకర్‌రెడ్డి, రహమాన్‌ఖాన్, నరసింహులు, మల్లేష్, వెంకటపూరం గోపి, నరేందర్‌గౌడ్, భాస్కర్, వెంకట్రాములు పాల్గొన్నారు.

నూతన పెన్షన్ విధానం రద్దు చేయాలి



సభ్యత్వ నమోదు చేపడుతున్న జనార్దన్‌రెడ్డి

కోసి రూరల్: ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీల మేరకు నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ముశ్రీఫా , సర్జఖాన్‌పేట్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెండింగ్ డీఏలు , 50 శాతం ఫిట్‌మెంట్‌తో కూడిన పీఆర్‌సీ, బదిలీలతో కూడిన ప్రమోషన్స్ వెంటనే ఇవ్వాలని లేకపోతే పెద్దఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం శేఖరయ్య , రాష్ట్ర ఆసోసియేట్ అధ్యక్షుడు వార్ల మల్లేషం , జిల్లా కార్యదర్శి బాలకృష్ణ , మండల అధ్యక్షుడు రాజేంద్రబాబు , ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, రమేష్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులపై ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలి

మాగనూర్: తరగతి గదులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని మాగనూర్ ఎంఈవో మురళీధర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మండల పరిధిలోని ఓబ్లాపూర్, అడవిసత్యారం గ్రామ మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నాణ్యమైన బోజనం అందించేలా పర్యవేక్షణ చేపట్టాలని ఉపాధ్యాయులు సూచించారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించడంతో పాటు పాఠశాలకు రాలేకపోతే సెలవు పత్రం సమర్పించాలన్నారు. ఆయన వెంట సీఆర్పీ కృష్ణయ్య, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



కోస్గి రూరల్: ప్రతి ఒక్కరు ఇంటి పరిసరాల్లో మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని విద్యుత్ ఏఈ వెంగటేష్ అన్నారు. శనివారం పట్టణంలోని సబ్‌స్టేషన్ అవరణలో వివధ రకాల పండ్ల మొక్కలు నాటారు. మొక్కలు పెరిగితే భవిష్యత్తు తరాలకు ప్రాణవాయువుతో పాటు ఫలాలు అందిస్తాయన్నారు. ప్రతి రోజు వాటికి నీటిని పోసి పెంచాలని సంబంధిత లైన్‌మెన్‌లను కోరారు. కార్యక్రమంలో లైన్‌మెన్‌లు దస్తయ్య, రవి, వెంకటేష్, మల్కయ్య, రాంచందర్ , విజయ్ తదితరులు ఉన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో షార్ట్‌సర్క్యూట్



మద్దూరు: మద్దూరు తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ప్రమాదం తప్పింది. కార్యాలయం సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌లో సమస్య తలెత్తడంతో తహసీల్దార్ కార్యాలయంలోని రికార్డు గదిలో స్విచ్ బోర్డులో ఒక్క సారిగా మంటలు చెలరేగాయి. స్పందించిన సిబ్బంది రికార్డులను పక్కకు తోసి మంటలను ఆర్పివేశారు. అనేక ఇళ్లలోనూ ట్యూబ్ లైట్లు, తదితర విద్యుత్ ఉపకరణాలు కాలిపోయినట్లు సమాచారం. విషయం తెలిసిన వెంటనే విద్యుత్ సిబ్బంది విద్యుత్ సరఫరా నిలిపేసి ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర న్యూటల్ వైరు సరిచేశారు.

టీబీ నివారణకు కృషి చేద్దాం

నారాయణపేట రూరల్: టీబీ నివారణకు కృషి చేద్దామని డాక్టర్ చందన అన్నారు. మండలంలోని శ్యాసన్ పల్లి గ్రామంలో శనివారం మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా కోటకొండ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది హాజరై ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. ప్రజలు తమ ఆరోగ్యం పట్ల ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. టీబీ, ఛాయా వంటి వ్యాధుల నిర్ధారణకు ఈ క్యాంప్ దోహద పడుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు శిరీష, మంజుద్, హెల్త్ సిబ్బంది నర్సింములు, అశోక్, దశరథ్ పాల్గొన్నారు.